
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
17-9-2026 (Thursday) MAIN EDITION

## ఏసీబీకి చిక్కిన సీఐ, ఎస్సై



**అక్షరటుడే, మల్కాజ్‌గిరి** : మల్కాజ్‌గిరి జోన్, కీసర పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులు, ఎస్సై ద్యాప జ్ఞానేందర్ రెడ్డి ఏసీబీకి చిక్కారు. స్టేషన్ బెయిల్ కోసం లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. కీసర పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే నమోదైన కేసులో ఫిర్యాదిదారుడికి, అతని స్నేహితుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేయడం, వారిని వేధించకుండా ఉండటం కోసం సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్ రూ.5 లక్షల లంచం డిమాండ్ చేశారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్సై లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు.

## ఆదిత్య ఠాక్రేకు రూ.500 కోట్ల లీగల్ నోటీసు



**అక్షరటుడే, మహారాష్ట్ర** : దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసులో ఆమె తండ్రి సతీష్ సాలియన్ ఆదిత్య ఠాక్రేకు లీగల్ నోటీసులు పంపారు. శివసేన (UBT) నాయకుడు ఆదిత్య ఠాక్రే, ఎన్సీపీ (ఎస్పీ) నాయకుడు, మహారాష్ట్ర మాజీ హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ నుంచి దిశా తండ్రి రూ.500 కోట్ల నష్టపరిహారాన్ని కోరారు. న్యాయం కోసం తాను చేస్తున్న ప్రయత్నాన్ని "రాజకీయ ప్రేరేపితం"గా చిత్రీకరించడానికి ఆదిత్య ఠాక్రే, అనిల్ దేశ్‌ముఖ్ ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు లీగల్ నోటీసులు పంపారు.

## తెలంగాణకు నేడు భారీ వర్ష సూచన



అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలో నేటి రాత్రి నుంచి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గురు, శుక్రవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడే ఛాన్స్ ఉందన్నారు. బలమైన గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉందన్నారు.

## భూ బకాసురుడు కేసీఆర్ : పొంగులేటి




అక్షరటుడే, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ భూ బకాసురుడని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తనకు ఒక్క ఎకరం కూడా భూమి లేదని 2004 కరీంనగర్ లోక్ సభ ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

## పీసీసీ చీఫ్‌పై పరువు నష్టం కేసు



అక్షరటుడే, నాంపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై నాంపల్లి కోర్టులో మాజీ మంత్రి హరీష్ రావు తరఫు న్యాయవాది పరువు నష్టం దావా వేశారు. క్షుద్ర పూజల ఆరోపణల నేపథ్యంలో కేసు వేశారు. క్షమాపణ చెప్పాలని గతంలోనే వారికి లీగల్ నోటీసులు పంపారు.

## వారణాసిలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన



**అక్షరటుడే, ఏపీ** : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వారణాసిలో పర్యటించారు. వారణాసివాద్‌నగర్ సేవాయాత్రలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసికి వచ్చానని తెలిపారు. బాల్యంలో మోదీ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అయితే అవి ఆయనను ఎదగకుండా అడ్డుకోలేకపోయాయన్నారు. మనమంతా ప్రధానికి మద్దతుగా ఉండాలన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై కీలక అప్‌డేట్

**అక్షరటుడే, హైదరాబాద్** : మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 28న ఓటర్ల జాబితా ప్రక్రియపై ప్రజా నోటీసు ఇస్తామని తెలిపింది. నవంబర్ 6న ఫారం 18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని పేర్కొంది.

# అదొక ప్రజా ఉద్యమం

- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం
- నిజాంను కీర్తించడం సిగ్గు చేటు : బండి సంజయ్

**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ చారిత్రక వేడుకల్లో పాల్గొనడం ఎంతో గౌరవంగా ఉందని ఆయన అన్నారు. హైదరాబాద్ సంస్థానం విమోచన కోసం, దేశంలో దాని విలీనం కోసం ప్రాణాలర్పించిన మహానుభావులను గౌరవించేందుకే ఈ వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



హైదరాబాద్ విమోచన పోరాటంలో చరిత్రపుటల్లో మరుగునపడిన ఎంతోమంది వీరుల గాథలను నేటి తరానికి వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ పోరాటం కొద్దిమంది నాయకులకు లేదా ప్రభుత్వాలకు మాత్రమే పరిమితం కాలేదని, ఇదొక అపూర్వమైన ప్రజా ఉద్యమమని స్పష్టం చేశారు. ఈ పోరులో విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజికరాజకీయ కార్యకర్తలు, రైతులు, సామాన్య ప్రజలు సైతం భాగస్వామ్యులయ్యారని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఎంతోమంది జైలు శిక్షలు, కఠిన హింసలు, వ్యక్తిగత ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు. రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ వంటి వీరుల త్యాగాలను జాతీయ స్థాయిలో ఎప్పటికీ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. చరిత్రను కేవలం పెద్దల కార్యాలయాలే కాకుండా, సామాన్య ప్రజల త్యాగాలు కూడా నిర్మిస్తాయని కొనియాడారు.

### ఆ త్యాగాలను గుర్తు చేసుకోవాలి

నిజాం అరాచక పాలనలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. అలాంటి పాలకుడిని అసెంబ్లీలో గొప్పవాడిగా కీర్తించడం సిగ్గుచేటని విమర్శించారు. నిజాంను పొగిడే నాయకులు బైరాన్‌పల్లి, పరకాల, గుండ్రాంపల్లి వంటి ప్రాంతాల్లో జరిగిన మారణహోమాలను, ప్రాణత్యాగాలను గుర్తుచేసుకోవాలని హితవు పలికారు.

### కిషన్ రెడ్డి ఆగ్రహం

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. నిజాం పాలనా కాలంలో తెలుగు భాషను అణచివేసి, ఉర్దూను బలవంతంగా రుద్దారని మండిపడ్డారు. కేవలం ఓట్ల రాజకీయాల కోసం సీఎం రేవంత్ రెడ్డి నిజాంను గొప్పవాడిగా చిత్రీకరిస్తూ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నిజాం గనుక మంచి పాలకుడైతే, ఆయనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ఎందుకు సాయుధ పోరాటం చేశారని ప్రశ్నించారు.

## సెమీ కండక్టర్ హబ్‌గా భారత్ : ప్రధాని మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ** : గ్లోబల్ సెమీ కండక్టర్ తయారీ హబ్ భారత్‌ను తయారు చేయడమే తమ లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'సెమికాన్ ఇండియా 2026' కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ప్రధాని మోదీ మట్లాడుతూ.. భారత్ చిప్ తయారీపై ఫోకస్ పెట్టిందని పేర్కొన్నారు. 10 రోజుల క్రితం ముంబైలో ఫిన్‌టెక్ సదస్సు జరిగిందని, ఇప్పుడు సెమికాన్ ఇండియా సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. బ్రిక్స్ సదస్సులో అందరి మద్దతుతో 'న్యూఢిల్లీ డిక్లరేషన్' ఆమోదం పొందడం అనేది అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కున్న విశ్వసనీయతకు మరో నిదర్శనం అని మోదీ అన్నారు.

## రేవంత్ రెడ్డికి అన్ని ఆస్తులు ఎక్కడివి : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్** : గోడల మీద రాతలు రాసే రేవంత్‌రెడ్డికి అన్ని కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పుట్టినప్పుడు చింతమడకలో ఇల్లు రెండెకరాలు ఉండేదని కేటీఆర్ అన్నారు. తమ నానమ్మ ఊరు కోనాపూర్‌లోని వందల ఎకరాల భూమి మానేరు డ్యామ్‌లో పోయిందని చెప్పారు. కేసీఆర్‌కు తాత ముత్తాతల నుంచే భూములు ఉన్నాయని చెప్పారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డికి అన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కొండారెడ్డిపల్లి వెళ్తే సీఎం బండారం బయటపడుతుందన్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబం ఆస్తులు, కేసీఆర్ కుటుంబం ఆస్తులపై విచారణకు సిద్ధమా అని సవాల్ చేశారు.

## జనన, మరణాల నమోదులో కీలక మార్పులు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్**: దేశవ్యాప్తంగా జనన, మరణాల నమోదు విధానాన్ని మరింత పకడ్బందీగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఆలస్య నమోదు, అవకతవకలకు చెక్ పెట్టే ఉద్దేశంతో తీసుకొచ్చిన 'జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం2026' అక్టోబర్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఈ మేరకు భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభల ఆమోదం, రాష్ట్రపతి గ్రీన్ సిగ్నల్ లభించడంతో ఈ సవరణ బిల్లు అధికారికంగా చట్ట రూపం దాల్చింది.

## భూ భారతితో సంస్కరణలు తెచ్చాం : సీఎం రేవంత్ రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ** : రైతుకు భూమితోనే భుక్తి లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే 'భూ భారతి' చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. తెలంగాణ భారత్‌లో అంతర్భాగం అయిన సందర్భంగా.. సెప్టెంబర్ 17న ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం పేరిట నిర్వహించింది. నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించిందని సీఎం చెప్పారు. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణిచివేత తీవ్రంగా ఉండేదని గుర్తు చేశారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా, భూమిభుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాయుధ పోరాటం జరిగిందన్నారు.





## కేసీఆర్ భూములపై అధికారుల కసరత్తు

**అక్షరటుడే, సిద్దిపేట** : మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ భూములపై రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ తహశీల్దార్ కార్యాలయంలో ఫామ్ హౌస్ భూములకు సంబంధించిన ఫైల్స్ వెతికి తీస్తున్నారు. ఫామ్ హౌస్ పరిసరాల్లో వివాదంలో ఉన్న 385 ఎకరాల భూమి ఉందని, అక్కడ ప్రభుత్వ భూమి ఎంత ఉందో 30 రోజుల్లో తేల్చాలని అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో చర్యలు చేపట్టారు.

## ట్రాఫిక్ కష్టాలకు చెక్..
## కొత్త అండర్ పాస్ ప్రారంభం

**అక్షరటుడే, గచ్చిబౌలి** : హైదరాబాద్ నగరంలోని నార్సింగి, పుప్పలగూడ మార్గంలో మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద కొత్త అండర్ పాస్‌ను సైబరాబాద్ పోలీసులు గురువారం ప్రారంభించారు. దీంతో అక్కడ ట్రాఫిక్ కష్టాలు కొంత మేర తీరనున్నాయి. అండర్‌పాస్ అందుబాటులోకి రావడంతో జంక్షన్ వద్ద యూ టర్న్ చేయడానికి పట్టే సమయం గణనీయంగా తగ్గనుంది. దీంతో నానక్‌రామ్ గూడ, క్రిన్స్ విల్లాస్ తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనదారులు జంక్షన్ వద్ద ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుంది.






## హిందూముస్లిం పోరాటమంటూ బీజేపీ కుట్ర : కవిత

**అక్షరటుడే, హైదరాబాద్** : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను తరిమికొట్టి, గద్దె దించుతామని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17 చరిత్రను కాంగ్రెస్, బీజేపీలు స్వార్థం కోసం వక్రీకరిస్తున్నాయని కవిత విమర్శించారు. ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటమంటూ బీజేపీ దీనికి మతపరమైన రంగు పులిమే కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. అసలు ఆనాటి పోరాట కాలంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉనికే లేదని స్పష్టం చేశారు.

## సైబర్ నేరస్తుల అరెస్ట్

**అక్షరటుడే, ఏపీ** : నంద్యాలలో సైబర్ మోసాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాధితులను ట్రాప్ చేసి డబ్బులు కాజేస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు. రూ.25 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్ ట్యాప్ స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాంత్, ప్రకాష్ నాయుడు అనే ఇద్దరు నేరస్తులను అరెస్టు చేశామని ఎస్పీ సునీల్ వెల్లడించారు.

